సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం ׀ 22 ׀ ఫిబ్రవరి ׀ 2023



ఆంగ్లేయులపై తిరగబడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడి వర్ధంతి సభను నేడు కడపలో నిర్వహించనున్నారు. - 8లో



ఆశలు ఆహుతి

అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షల మేర నోట్ల కట్టలు కాలిపోయిన సంఘటన మంగళవారం ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. -10లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.5/18.1

జిల్లాలో మంగళవారం 18.1 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

పల్లె బిడ్డలు.. ఆటల్లో దిట్టలు

కేవలం వెయ్యి లోపు జనాభా కలిగిన ఓ చిన్న గ్రామం పెద్ద ఫలితాలను, పతకాలను సాధిస్తూ క్రీడాగ్రామంగా ఖ్యాతినార్జిస్తోంది. గ్రామంలోని ప్రతి వీధిలో తప్పనిసరిగా ఓ క్రీడాకారుడు ఉంటాడంటే అతిశయోక్తి కాదు.. అంకిత, హేమావతి, రామ్మోహన్.. ఇలాంటి వారెందరో జాతీయస్థాయిలో రాణిస్తూ పల్లె పేరును చాటిచెబుతున్నారు. ఆ గ్రామం ఏంటో తెలుసుకోవాలంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే..

- ఆ గ్రామంలో ప్రతి వీధిలోనూ క్రీడాకారులే..
- చిన్న గ్రామం నుంచి వందల సంఖ్యలో క్రీడాకారులు
- పదుల సంఖ్యలో జాతీయస్థాయి పతకాలు
- క్రీడాపాఠశాలకు ఏటా ప్రవేశాలు



బయనపల్లె ఎస్వీ హైస్కూల్ మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి


కడప స్పోర్ట్స్: చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సమీపంలోని 1000 లోపు జనాభా కలిగిన చిన్నగ్రామం బయనపల్లె. అయితేనేం.. చిన్న గ్రామం నుంచి పెద్దక్రీడాకారులు తయారై జాతీయ స్థాయిలో సైతం బయనపల్లె పేరు ప్రఖ్యాతులు చాటిచెబుతున్నారు. పదుల సంఖ్యలో పతకాలు, వందల సంఖ్యలో క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో రాణించడం వెనుక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల కృషి ఉందన్నది స్థానికుల అభిప్రాయం. చింతకొమ్మదిన్నె మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం ఉన్నప్పటికీ కేవలం క్రీడల కోసం వివిధ పల్లెల నుంచి ఈ పాఠశాలలో ప్రవేశాలు పొందుతుండటం విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీన్‌దయాల్ ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుడు మాద పవన్‌కుమార్ కృషితో బయనపల్లె గ్రామంతో పాటు సమీపంలోని గ్రామాలకు చెందిన విద్యార్థులు సైతం క్రీడాకారులుగా రాణిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రతి వీధిలో ఓ క్రీడాకారుడు ఉన్నాడంటే గ్రామంలో ఉన్న క్రీడాచైతన్యం మనకు అర్థమవుతుంది.

క్రీడల్లో రాణిస్తున్నారిలా..

బయనపల్లెలోని పాఠశాల క్రీడామైదానం ఎందరో జీవితాలకు వెలుగునిచ్చింది. దాదాపు నలభై సంవత్సరాల క్రితం నుంచే ఇక్కడి నుంచి క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం ప్రారంభమైంది. ప్రస్తుత యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి సైతం ఇదే పాఠశాల, ఇదే మైదానంలో సాధన చేసి జాతీయస్థాయిలో ఖోఖోలో రాణించి పతకాలు సాధించిన క్రీడాదిగ్గజమే. వైవీయూ క్రీడాశాఖ డైరెక్టర్‌గా ఉంటూ వీలున్న సమయంలో వచ్చి క్రీడాకారులకు ఖోఖోలో మెలకువలు నేర్పుతూ, తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన పాఠశాలను, మైదానానికి తిరిగి సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు బి. రాముడు ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించడంతో 20 సంవత్సరాల క్రితమే (2004) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దిగ్గజ పాఠశాలగా క్రీడాప్రతిభా పురస్కారం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా లభించింది. అనంతరం 2012లో వ్యాయామ ఉపాధ్యాయుడుగా బాధ్యతలు చేపట్టిన మాద పవన్‌కుమార్ అంకితభావం, క్రమశిక్షణ, శిక్షణ గ్రామస్తులను, క్రీడాకారులను మైదానం వైపు నడిపించేలా చేశాయి. ఈయన వద్ద శిక్షణ పొందిన కె. రామ్మోహన్ ఏపీ ఖోఖో పురుషుల జట్టుకు వెన్నుముకలా నిలుస్తున్నారు. చెన్నై క్విక్ గన్ ఖోఖో జట్టు రూ. 2 లక్షలు వెచ్చించి ఈయన్ను కొనుగోలు చేసింది. అదే విధంగా ఇ. హేమావతి జాతీయస్థాయిలో పదుల సంఖ్యలో పాల్గొని పతకాలు సాధించింది. ఇదే ప్రాంతానికి చెందిన హాకీ క్రీడాకారిణి బెంగళూరు సాయ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న అంకిత (బుగ్గలేటిపల్లి) తాజాగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో త్వరలో నిర్వహించనున్న ఆలిండియా సాయ్ హాకీ పోటీలకు ఎంపిక కావడం గమనార్హం. వీరితో పాటు పలువురు క్రీడాకారులు హాకీ, వాలీబాల్, ఖోఖో క్రీడాంశాల్లో రాణిస్తూ రానున్న తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే విధంగా స్పోర్ట్స్‌కోటాలో సైతం ఉద్యోగాలు సాధించి క్రీడల ప్రాధాన్యతను చాటిచెబుతున్నారు.

క్రీడాపాఠశాలకు ప్రధానద్వారం..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందాలనుకునే వారికి ప్రతియేటా బయనపల్లె మైదానంలో వేసవిలో ఇచ్చే ప్రత్యేక శిక్షణతో ప్రవేశాలను సులువుగా పొందగలుగుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న ఏకైక క్రీడాపాఠశాలలో ప్రతియేటా బయనపల్లె నుంచి ప్రవేశాలు ఉండటం విశేషం. కేవలం బయనపల్లె నుంచి ఇప్పటి వరకు వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 21 మంది ప్రవేశాలు పొందగా, ఇక్కడ శిక్షణ పొందిన ఇతర ప్రాంతాల విద్యార్థుల సంఖ్య కలుపుకుంటే సింహభాగం క్రీడాపాఠశాలలో ప్రవేశాలు ఇక్కడివే ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు.



ఇక్కడ నేర్చుకుని.. జాతీయస్థాయిలో రాణిస్తున్నా..



బయనపల్లె పాఠశాలలో ఖోఖోలో ఓనమాలు నేర్చుకున్నాను. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. గతేడాది అల్టిమేట్ ఖోఖో లీగ్ పోటీల్లో చెన్నైకి చెందిన చెన్నై క్విక్ గన్ జట్టు రూ.2 లక్షలు వెచ్చించి నాకు ఆడే అవకాశం కల్పించింది. – కె. రామ్మోహన్, చెన్నై క్విక్ గన్ జట్టు క్రీడాకారుడు

జాతీయస్థాయిలో పతకాలు సాధించా



నేను 7 నుంచి 10వ తరగతి వరకు బయనపల్లె ఎస్.వి. హైస్కూల్‌లో చదివాను. చదువుకుంటున్న సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్ సార్ ప్రోత్సాహంతో క్రీడలవైపు దృష్టిసారించా. ఖోఖో క్రీడను ఎంపిక చేసుకుని ఇప్పటి వరకు పదుల సంఖ్యలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. – ఇ.హేమావతి, ఖోఖో జాతీయ క్రీడాకారిణి, బయనపల్లె

సాయ్ నేషనల్స్‌లో పాల్గొంటున్నా..



మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఆలిండియా సాయ్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నా. ఇప్పటి వరకు 3 నేషనల్స్ ఆడాను. బయనపల్లె ఎస్.వి. హైస్కూల్ మైదానంలో 3వ తరగతిలో హాకీ నేర్చుకున్నాను. క్రీడాపాఠశాలలో హాకీ కోచ్ ఖాదర్ వద్ద శిక్షణ పొందాను. – బి. అంకిత, జాతీయస్థాయి హాకీ క్రీడాకారిణి,

క్రమం తప్పకుండా శిక్షణ..



బయనపల్లె ఎస్.వి.హైస్కూల్ మైదానంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా క్రీడాశిక్షణ అందిస్తున్నాం. తల్లిదండ్రులు సైతం వారి పిల్లలను ఆసక్తిగా తీసుకువచ్చి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ఇప్పటికే ఎందరో క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. రానున్న రోజుల్లో మరింత మంది క్రీడాకారులు పతకాలు సాధిస్తారు. – మాద పవన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు, బయనపల్లె, చింతకొమ్మదిన్నె

క్రీడాచైతన్యం ఎక్కువ..



బయనపల్లె గ్రామంలో క్రీడాచైతన్యం ఎక్కువ. దాదాపు ప్రతి కుటుంబం నుంచి ఎవరో ఒకరు.. ఏదో ఒక క్రీడాంశంలో శిక్షణ పొందుతుండటం విశేషం. చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం క్రీడల కోసం ప్రత్యేకంగా మా పాఠశాలలో ప్రవేశాలు పొందుతున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అధికారుల సహకారంతో క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నాం. – వై. దీన్ దయాల్, ప్రధానోపాధ్యాయుడు, ఎస్.వి. ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్, కడప

న్యూస్‌రీల్

గంగమ్మ జాతరకు 50 ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డి సర్కిల్: లక్కిరెడ్డి పల్లె మండలం అనంతపురం గ్రామంలో జరుగుతున్న గంగమ్మజాతరకు 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 25 బస్సులు, పులివెందుల డిపో నుంచి 25 బస్సులు మొత్తం 50 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడప నుంచి రూ. 80, పులివెందుల నుంచి రూ. 130లు చార్జీగా నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామయ్య కల్యాణాన్ని సౌకర్యంగా వీక్షించేలా ఏర్పాట్లు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామయ్య బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఏప్రిల్ 5న జరగబోయే రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులు అన్ని సౌకర్యాలతో వీక్షించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని టీటీడీ ఈఈ సుమతి తెలిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా జరుగుతున్న కల్యాణ వేదిక ఏర్పాట్లను మంగళవారం టీటీడీ ఈఈ సుమతి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణం రోజున వచ్చే భక్తులకు కావాల్సిన తాగునీరు, అన్నప్రసాదాలు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించామన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలను కూడా నేర్పించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాధ్యతగా మంచి చెడులు తెలియజెప్పాలని సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 18 సంవత్సరాలలోపు ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి తమ పిల్లలకు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహం చేస్తామని లేఖను రాయించుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. డీఈఓ దేవరాజు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై ప్రజలు, కార్యకర్తలకు నమ్మకం లేదు

- సామాజిక న్యాయం అంటే ఏమిటో జగన్ చేతల్లో చూపిస్తున్నారు
- చంద్రబాబు ప్రాజెక్టులను, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు
- వైఎస్సార్ వల్లే రాయలసీమకు సాగునీరు, తాగునీరు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి, చిత్రంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, కార్యకర్తల్లో ధైర్యం సన్నగిల్లిందని మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తమ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపేందుకు 'జగన్‌కు భయం అంటే ఏమిటో చూపిస్తా', 'భయం నా డిక్షనరీలోనే లేదు' వంటి డైలాగులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం 18 ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 14 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని, శాసనమండలిలో మొత్తం 46 మంది ఉంటే అందులో 68 శాతం అనగా 30 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, టీడీపీ ఉన్నత వర్గాల తరుపున నిలబడి వాటిని అడ్డుకుంటోందన్నారు. చంద్రబాబు పద్నాలుగేళ్లు సీఎంగా ఉండి సాగునీటి ప్రాజెక్టులను, వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. రాయలసీమకు సాగునీరు, తాగునీరు అందించడానికి వైఎస్సార్ జలయజ్ఞం చేపట్టి ప్రాజెక్టులు చేపట్టారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్టులను పూర్తి చేసి నీటితో నింపారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజార్టీ అందించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. తాను ఎలాంటి షరతుల్లేకుండా పార్టీలో చేరినా, ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన పార్టీ ముఖ్య నేతలు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలో బీసీలకు పెద్దపీట వేసిన రాష్ట్రం మనదే: మేయర్ సురేష్‌బాబు

దేశంలో బీసీలకు పెద్దపీట వేసిన రాష్ట్రం మనదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో బీసీలకు ఇంత ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. బీసీ ముఖ్యమంత్రులు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో కూడా ఇంత గుర్తింపు ఇవ్వలేదన్నారు. జగన్ పాలనను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రుషికేశవరెడ్డి, కె. రామాంజనేయరెడ్డి, వై. రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొన్నపురెడ్డి నామినేషన్

- మధ్యాహ్నం 12.30 గంటలకు ముహూర్తం



కడప కార్పొరేషన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల మధ్య ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులైన మేయర్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో సమావేశం కానున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి. రామసుబ్బారెడ్డి నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకుడు బి. నిత్యానందరెడ్డి పిలుపునిచ్చారు.

దారులన్నీ.. గంగమ్మ జాతర వైపే!

- అంగరంగవైభవంగా ప్రారంభమైన అనంతపురం గంగమ్మ జాతర
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందినీ బండ్లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ దేవత



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లల్లో బారులు తీరిన భక్తులు

లక్కిరెడ్డిపల్లి: రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ దేవత జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. భక్తజనం పోటెత్తారు. గంగమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గంగమ్మ తల్లీ.. కాపాడవమ్మా అంటూ వేడుకున్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దారులన్నీ అమ్మవారి సన్నిధికే అన్నట్లు వేలాది వాహనాలు జాతర వైపు సాగాయి. సంతానం కోసం మహిళా భక్తులు అమ్మవారికి ఒరపడి ప్రార్థించారు.

ప్రత్యేక ఆకర్షణగా చాందీని బండ్లు: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు చేరుకోవడంతో చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పటిష్ట బందోబస్తు: అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన కడప మేయర్ సురేష్ బాబు

కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

ఆలయ ఖ్యాతిని మరింత పెంచుతాం: ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

అనంతపురం గంగమ్మ ఆలయ ఖ్యాతిని మరింత పెంపొందిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయం వెనుక భాగంలో రాజగోపురం, కోనేరు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కుందూలో వృద్ధురాలి గల్లంతు

పెద్దముడియం : మండల పరిధిలోని దిగువ కల్వటాల గ్రామానికి చెందిన సి.చిన్న సంజమ్మ(75) అనే వృద్ధురాలు కుందూ నదిలో గల్లంతయినట్లు గ్రామస్తులు తెలిపారు. వీఆర్వో కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న సంజమ్మకు గతంలో భర్త చనిపోగా ముగ్గురు కుమారులు కలరు. ఇద్దరు కుమారులు గ్రామంలో నివసిస్తుండగా పెద్ద కుమారుడు నంద్యాల జిల్లా రుద్రవరంలో ఉంటున్నాడు. ఈమె చిన్న కుమారుడి దగ్గర ఉండేది. మంగళవారం ఉదయం పెద్ద కుమారుడి దగ్గరకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వచ్చి పెద్దముడియం దగ్గర ఉన్న కుందూ నదిలో దూకడంతో గల్లంతయినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ అడగగా.. కుందూ నదిలో వృద్ధురాలు గల్లంతుపై ఫిర్యాదు ఏమి అందలేదని తెలిపారు.

యువకుడి దారుణ హత్య

– హత్య చేసి శవానికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన దుండగులు


విజయ్‌కుమార్ (ఫైల్)

వేంపల్లె : వేంపల్లెలో తమ్మిశెట్టి విజయ్‌కుమార్ (20) అనే యువకుడు సోమవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె పట్టణం ప్రియా తోటకు చెందిన టి.రాము, లక్ష్మీదేవి దంపతులకు వినయ్‌కుమార్, విజయ్‌కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయ్‌కుమార్‌కు ఏడు నెలల క్రితం అలిరెడ్డిపల్లెకు చెందిన లక్ష్మీప్రసన్నతో వివాహం జరిగింది. వృత్తి రీత్యా ఫ్లోరింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే వాడు. ఈ క్రమంలో పాములూరు గుట్ట సమీపంలోని నాగులకట్ట వద్ద హత్యకు గురయ్యాడు. దుండగులు హత్య చేసి శవానికి పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి యువకుడి మృతి


సంజయ్ పాండే మృతదేహం

పులివెందుల/రూరల్ : పులివెందుల పట్టణం కదిరి రోడ్డులోని కంకర మిషన్ సమీపంలో ఉన్న నీటి కుంటలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు యువకులు పులివెందులకు వలస కూలీలుగా వచ్చారు. వారిలో సంజయ్ పాండే(22), దీపక్ కలిసి సోమవారం సాయంత్రం నీటి కుంటలో స్నానం చేయడానికి వెళ్లారు. సంజయ్ పాండే ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. ఈ విషయాన్ని దీపక్ పోలీసులకు తెలిపారు. ఎస్ఐ హుస్సేన్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మైలవరం డ్యాంకు చెందిన గత ఈతగాళ్లను పిలిపించి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 270 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 270 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 248 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళుతున్న కార్లు, జీపులు, తదితర వాహన డ్రైవర్లు 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు.

ఆంగ్లేయులపై తిరగబడ్డ కడప బిడ్డ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

- జాతీయోద్యమానికి స్ఫూర్తి
- ప్రథమ స్వాతంత్య్ర యోధునిగా కీర్తి
- ఉరికొయ్యను ముద్దాడి నేటికి 176 ఏళ్లు
- నేడు కడపలో వర్ధంతి సభ



కడప సెవెన్‌రోడ్స్ : భారతీయుల్లో జాతీయ భావం అప్పటికి సరిగా మొగ్గతొడగలేదు. ఆధునిక చరిత్రకారులు ప్రథమ భారత స్వాతంత్య్ర సంగ్రామంగా పేర్కొనే సిపాయిల తిరుగుబాటు జరగలేదు. కానీ అంతకు పదేళ్ల క్రితమే నాటి కడప జిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన దొరవారి నరసింహారెడ్డి ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. నేటికి సరిగ్గా 176 ఏళ్ల క్రితం ఉరికొయ్యను ముద్దాడి ఆయన భావి భారత జాతీయోద్యమానికి స్ఫూర్తిగా, దిక్సూచిగా నిలిచారు.

తిరుగుబాటులో ముఖ్య సంఘటనలు

1846 జూన్‌లో తనకు రావాల్సిన పెన్షన్ కోసం అనుచరులను కోయిలకుంట్ల ట్రెజరీకి పంపగా తహసీల్దార్ రాఘవాచార్యులు తిట్టి పంపడంతో పోరాటానికి తెర లేచింది. జూలై 7 లేదా 8 తేదీల్లో చాగలమర్రి తాలూకా రుద్రవరం గ్రామాన్ని కొల్లగొట్టుకుపోతుండగా మిట్టపల్లె వద్ద పోలీసులతో పోరాటం జరిగింది. జూలై 10న కోయిలకుంట్ల ట్రెజరీపై రెడ్డి బృందం దాడి జరిపింది. జూలై 23న గిద్దలూరు వద్ద లెఫ్టినెంట్ వాట్సన్, 24న ముండ్లపాడు వద్ద కెప్టెన్ నాట్, కెప్టెన్ రసల్ నాయకత్వంలోని సైన్యంతో పోరాటం సాగింది. అక్టోబరు 6న పేరుసోముల కొండల్లో పట్టుబడ్డారు. 1847 ఫిబ్రవరి 22న సోమవారం ఉదయం 7 గంటలకు కోయిలకుంట్లలో 2000 మంది ప్రజలు చూస్తుండగా కడప కలెక్టర్ కాక్రేన్ సమక్షంలో నరసింహారెడ్డిని ఉరి తీశారు. 1877 వరకు ఆయన తల ఉరి కంభానికి వేలాడుతూనే ఉంచారు.

'సీమ' రైతాంగ పోరాటం

నరసింహారెడ్డి తన పెన్షన్ కోసం తిరుగుబాటు చేశారే తప్ప బ్రిటీషు పాలకులను వెళ్లగొట్టాలన్న లక్ష్యంతో కాదని ఇటీవల సోషల్ మీడియా వేదికల్లో కొందరు వాదించడంలో నిజం లేదని జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుల అభిప్రాయం. పెన్షన్ కోసమే అయితే సుమారు 9 వేల మంది ప్రజలు తిరుగుబాటులో ఎందుకు పాలుపంచుకున్నారన్న ప్రశ్నకు విమర్శకుల వద్ద సమాధానం లేదు. కరువులు వచ్చి పంటలు పండకపోయినా భూమి శిస్తు వసూలు చేసేవారు. పైగా శిస్తుల భారం అధికంగా ఉండటంతో అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను రైతులు బీళ్లుగా పెట్టాల్సి వచ్చింది. గ్రామ కట్టుబడి బంట్రోతులు అనుభవించుకుంటున్న మాన్యం భూముల వంశపారంపర్య హక్కులు ప్రభుత్వం రద్దు చేసింది. సంతతి లేకుండా మరణించిన కట్టుబడుల భూములను లాగేసుకున్నారు. గ్రామ విధులను సరిగా నిర్వర్తించలేదని కొందరి తవర్జీ తగ్గించారు. బంట్రోతులను బదిలీ చేయడం, గ్రామ పోలీసు వ్యవస్థ పునర్ నిర్మాణానికి ప్రయత్నించారు. ఇవన్నీ కట్టుబడులలో అలజడి కలిగించడంతో నరసింహారెడ్డి వెంట నడిచారు. ఈ కేసు విచారణ చేసిన స్పెషల్ కమిషనర్ ఇంగ్లిస్ స్వయంగా ఈ వివరాలను బోర్డు ఆఫ్ రెవెన్యూకు నివేదించారు. ఈ కారణాల రీత్యా దీన్ని రాయలసీమ రైతాంగం జరిపిన తొలి తిరుగుబాటుగా భావించాలని చరిత్రకారులు అంటున్నారు.

నరసింహారెడ్డి అందరివాడు

జాతీయ నాయకుల మాదిరే నరసింహారెడ్డిని కూడా ఒక సామాజిక వర్గానికి అంటగట్టి మాట్లాడే ధోరణి సరికాదని మేధావుల అభిప్రాయం. నరసింహారెడ్డి గురువుగా భావించే గోసాయి వెంకయ్య ప్రధాన అనుచరులైన కరణం అశ్వర్థామ, జంగం మల్లయ్య, వడ్డె ఓబన్నలతోపాటు చెంచులు, యానాదులు, బోయలు, వడ్డెరలు తిరుగుబాటులో ప్రధానంగా పాల్గొన్నారు. చివరకు బ్రాహ్మణులు సైతం పాల్గొన్నారంటే ఆ తిరుగుబాటుకు ఉన్న ప్రజా పునాది అర్థమవుతుందని మేధావులు స్పష్టం చేస్తున్నారు.

చరిత్రకారుల చిన్నచూపు

సిపాయిల, సన్యాసుల, మోప్లా, చిట్టగాంగ్, రంపా, చీరాల–పేరాల తిరుగుబాట్ల గురించి నాటి చరిత్రకారులు పేర్కొన్నారు. కానీ వాటి కంటే ఎన్నో ఏళ్ల ముందు స్వరూపంలో ఏమాత్రం తీసిపోని నరసింహారెడ్డి తిరుగుబాటు గురించి పట్టించుకోలేదని అంటున్నారు. 1955లో బెంగాలి చరిత్రకారుడు ఎస్‌బీ చౌదరి మాత్రమే తాను రాసిన 'సివిల్ డిస్టబెన్సెస్ డ్యూరింగ్ ద బ్రిటీషు రూల్ ఇన్ ఇండియా (1765–1857)' అనే గ్రంథంలో నరసింహారెడ్డి తిరుగుబాటు గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆంధ్ర చరిత్రకారులు కనీసం తిరుగుబాటుకు సంబంధించిన కాలక్రమణికను కూడా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

నేడు వర్ధంతి సభ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను బుధవారం ఉదయం కడప నగరంలోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా హైస్కూలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– లెక్కల కొండారెడ్డి, రెడ్డి సేవా సమితి, కడప

నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నరసింహారెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించడం, కర్నూలు ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టడం అభినందనీయం. భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఆయన విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలి.

– కేశవులు నాయుడు, పాలెగార్ వంశీయులు, మాదినేనిపాలెం, గుర్రంకొండ

ఏమి కష్టం వచ్చిందో..

– ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య


శ్రావణ్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : పట్టుమని 13 ఏళ్లు కలిగిన ఓ విద్యార్థికి ఏమి కష్టం వచ్చిందో తెలియదు గానీ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో.. తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. బాగా చదివించుకుందామనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. మరణించి ఆ కుటుంబానికి తీరని వేదన మిగిల్చాడు. దీంతో ఆ కుటుంబం బోరున విలపించిన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో చోటు చేసుకొంది. ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు రహదారిలోని గాయత్రి నగర్‌లో మాడెం చంద్రశేఖర్‌రెడ్డి, సుహాసినికి శ్రావణ్‌కుమార్‌రెడ్డి(13) అనే ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. చంద్రశేఖర్‌రెడ్డి బేల్దారి పనికి, సుహాసిని వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుమారుడిని పట్టణంలోని జాన్స్ హైస్కూల్‌లో చదివిస్తున్నారు. 7వ తరగతి చదువుతున్న ఈ బాలుడు ఎక్కువగా పాఠశాలకు వెళ్లేవాడు కాదు. పాఠశాలలో ఎవరితోనూ గొడవపడే వాడు కాదు. అప్పుడప్పుడు పాఠశాల ఎగ్గొట్టి ఇంట్లోనే ఉంటూ ఎక్కువగా టీవీ, ఫోన్ చూసేవాడు. రెండు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. అయితే 10 రోజుల కిందట బ్యాగ్‌లో దుస్తులు పెట్టుకుని ఇంటి నుంచి పారిపోయి మైలవరం మండలం నవాబుపేట రోడ్డు వద్ద రాత్రి పూట ఉండగా గుర్తించిన లారీ డ్రైవర్లు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీ కేసులో జువైనల్ హోంకు బాలుడు

ప్రొద్దుటూరు క్రైం : దొంగతనం కేసులో నేర నిరూపణ కావడంతో ప్రొద్దుటూరుకు చెందిన మైనర్ బాలుడిని జువైనల్ హోంకు పంపించారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయం వీధిలో నివాసం ఉంటున్న దూదేకుల మౌలాలి గాంధీరోడ్డులో ఉన్న ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్‌లో మేనేజర్‌గా ఆయన భార్య స్టేట్‌బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో 2021 మే 11న ఇద్దరూ విధుల్లో భాగంగా బ్యాంకులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన బాలుడు తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అదే రోజు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి కేసు దర్యాప్తులో చోరీ చేసిన బాలుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సొత్తును రికవరీ చేశారు. విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో జేజేబీ కడప మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ బాలుడిని ఏడాది పాటు అబ్జర్వేషన్ హోంకు పంపినట్లు టూ టౌన్ ఇబ్రహీం తెలిపారు.

ప్రమాదం చేసి.. పారిపోయి మృత్యువాత

రాజుపాళెం : రోడ్డు ప్రమాదం చేసి.. భయంతో పారిపోయి మృత్యువాత పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కూలూరు గ్రామానికి చెందిన చిలంకూరు భూపాల్ (52) రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా చాగలమర్రి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం చేశాడు. పోలీసులు తనను పట్టుకు పోతారనే అనుమానంతో ఆయన పొలాల వెంట పారిపోయాడు. కూలూరు గ్రామ పొలాల్లో భూపాల్ మృతి చెంది ఉండగా.. కుటుంబ సభ్యులు మంగళవారం గుర్తించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని భార్య తెలిపారు. ఆయనకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సామాజిక న్యాయానికి పెద్ద పీట


మహాత్మా పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ప్రజల సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చట్ట సభలకు పంపే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి సామాజిక న్యాయా నికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన వారికి ఇంటి వద్దకే పథకాలు అందిస్తూ సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. అనంతరం ఆయన పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలతో పలు రాజకీయ అంశాలపై చర్చించారు. అంతకముందు ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

మహాత్మా పూలే విగ్రహానికి క్షీరాభిషేకం

కడప కార్పొరేషన్ : శాసనమండలి సభ్యులుగా 11 మంది బీసీలకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ స్థానిక పాతబస్టాండులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, కె.సూర్యనారాయణ రావు, షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.క్రిష్ణారెడ్డి, జమాల్‌వలీ, ఆర్‌వీ రమణ, డాక్టర్ సొహైల్, సుభాన్‌బాషా, సుబ్బరాయుడు, త్యాగరాజు, డిష్ జిలాన్, ఈశ్వరయ్య, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, అర్జున్, మధు, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, క్రిష్ణవేణి, సునీత, నారాయణమ్మ, రామలక్షుమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

బీసీల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టారు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలబెట్టారని పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ రషీద్ మృతి


అబ్దుల్ రషీద్ (ఫైల్)

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ షేక్ అబ్దుల్ రషీద్ (80) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. వయోభారంతో కొద్దికాలంగా ఇంటికే పరిమితమైన ఆయన పరిస్థితి విషమించి మరణించారు. దాదాపు 60 ఏళ్లుగా జిల్లాలో సీనియర్, ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా అటు పాత్రికేయ రంగానికి, ఇటు రాజకీయ రంగానికి సుపరిచితులు. రాయల్ ఫొటో స్టూడియో స్థాపించి ప్రజలకు సేవలు అందించారు. పాతతరం ఫొటోల కోసం రాయలసీమ వ్యాప్తంగా అందరూ ఆయననే సంప్రదించేవారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, పలువురు పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు, ప్రజాప్రతినిధులు వెళ్లి అబ్దుల్ రషీద్ మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుల మధ్య ఘర్షణ

– 9 మందిపై కేసు నమోదు

బద్వేలు అర్బన్ : కొన్ని నెలల క్రితం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులో ఇరువర్గాలకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. ఘటనపై పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. స్థానిక నెల్లూరు రోడ్డులో మెకానిక్ షెడ్డు నిర్వహించుకునే షరీఫ్ అనే యువకుడిపై కొంత మంది యువకులు దాడి చేయగా.. తిరిగి షరీఫ్ తన స్నేహితులతో కలిసి శివసాయిరెడ్డిపై దాడి చేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఇరువర్గాల వారు ఘర్షణ పడేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు వెళ్లి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం శివసాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు ఐదుగురిపై, షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ కత్తివెంకటరమణ నలుగురిపై కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

అట్లూరు : మండల పరిధిలోని కాటంవారిపల్లెకు చెందిన సుంకర మహేంద్ర (19) అనే యువకుడు నెల రోజులుగా కనిపించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు. బెంగళూరులోని ఓ బేకరీలో పని చేసేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో బెంగళూరుకు వెళ్లి తల్లి రమాదేవి, తండ్రి కొండయ్య గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్యాభర్తలపై కత్తితో దాడి

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లె గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కడప వంశీ, అతని భార్య రామాంజనమ్మపై పెద్ద ఓబయ్య అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు...కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన పెద్ద ఓబయ్య, కడప వంశీ అనే వ్యక్తులు మద్యం సేవించే విషయంలో గొడవ పడి తిట్టుకున్నారు. ఈ గొడవలో పెద్ద ఓబయ్య కత్తితో కడప వంశీతోపాటు అతని భార్య రామాంజనమ్మను గాయపరిచాడని ఎస్ఐ తెలిపారు. చికిత్స నిమిత్తం వారిని కడప రిమ్స్‌కు తరలించి పెద్ద ఓబయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కువైట్ నుంచి స్వస్థలానికి మృతదేహం

పోరుమామిళ్ల : కువైట్‌లో వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపవరం జయరామిరెడ్డి మృతదేహం స్వగ్రామం క్రిష్ణంపల్లెకి చేరింది. డ్రైవర్‌గా పని చేస్తున్న జయరామిరెడ్డి లారీ నడుపుతుండగా కారు ఢీకొని రెండు వాహనాలు తుక్కయ్యాయి. ఈ ప్రమాదంలో జయరామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి కువైట్‌లో లాంఛనాలు పూర్తి చేశాక షేక్ సోమవారం రాత్రి చెన్నైకి పంపించారు. చెన్నై నుంచి రాత్రి పదిన్నరకు మృతదేహం క్రిష్ణంపల్లెకు చేరగా మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. జయరామిరెడ్డి భార్య క్యాన్సర్‌తో పది సంవత్సరాల క్రితం మృతి చెందగా ఆయన కుమారుడు, కూతురు బాబాయ్ దశరథరామిరెడ్డి వద్ద ఉంటున్నారు.

25న 'సత్యాగ్ని కథలు' పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీతో కలిసి శనివారం ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో సీనియర్ కథా రచయిత షేక్ హుసేన్ సత్యాగ్నికథలు పేరిట వెలువడిన పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయా సంస్థల ప్రధాన కార్యదర్శులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, కొండూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అరసం గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.సంజీవమ్మ అధ్యక్షత వహించనున్నారని, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. ప్రముఖ కథా రచయిత దాదా హయాత్ సత్యాగ్ని కథలు పుస్తకాన్ని సమీక్షించనున్నట్లు తెలిపారు. గౌరవ అతిథులుగా కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, మానస గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎండీ లయన్ కె.చిన్నపరెడ్డి హాజరు కానున్నారని వివరించారు. అరసం జిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ ఆత్మీయ అతిథులుగా హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌వర్మ

కడప సిటీ : ఫ్యాక్టరీలలో అనుకోని ప్రమాదాలు సంభవించినపుడు వాటిని నివారించడానికి, సురక్షితంగా ప్రజలను, కార్మికులను కాపాడడానికి ముందస్తు వ్యూహంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినపుడు వాటిని నివారించడానికి మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించిందన్నారు. అందువల్ల కలెక్టర్ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో పరిశ్రమల్లో రసాయన అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి ముందస్తు వ్యూహంలో భాగంగా నగర శివార్లలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఈ నెల 23న ఐఓసీఎల్ బాట్లింగ్ ప్లాంట్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణమూర్తి, హెచ్‌పీసీఎల్ మేనేజర్ మన్మధరావు, ఐఓసీఎల్ మేనేజర్ ధర్మారావు, జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్, డీఎంహెచ్ఓ నాగరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, ఫైర్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు జేసీ రాంసుందర్‌రెడ్డికి మాతృవియోగం


కాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు

చాపాడు : కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తల్లి శెట్టిపల్లె కాంతమ్మ(73) సోమవారం రాత్రి మృతి చెందారు. చాపాడు మండలం నక్కలదిన్నెలో నివాసం ఉంటున్న కాంతమ్మ సోమవారం మధ్యాహ్నం బైక్‌పై నుంచి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ క్రమంలో మంగళవారం స్వగ్రామమైన నక్కలదిన్నెలో కాంతమ్మ మృతదేహం వద్ద సమీప బంధువు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సతీమణి ప్రభావతమ్మ, కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వరావు, డీఐజీ సింధిల్ కుమార్, మున్సికమిషనర్ భార్గవ తేజ, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి, తహసీల్దారు సుభానీ, ప్రొద్దుటూరు స్పందన సుబ్బరామిరెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, చాపాడు మండల అధ్యక్షులు లక్ష్మయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు నివాళులర్పించారు.